# విత్తన బంతులు



సామూహిక మొక్కలునాటే కార్యక్రమం లాగానే- అంతకంటే తక్కువ వనరులతో, తక్కువ ఖర్చుతో అదేవిధమైన ఫలితంకొసం అనుసరించదగిన ప్రత్యామ్నాయ మార్గం "విత్తన బంతులు".

మట్టి, ఎరువుల మిశ్రమం మధ్యలో విత్తనాలనుంచి విత్తన బంతులు తయారుచేస్తారు. వీటిని పూలవిత్తనాలు, కూరగాయల విత్తనాలతోకూడా చేసినా దేశీయ వృక్షజాతుల విత్తనాలతో చేయడమే సర్వసాధారణం.

## విత్తన బంతుల్ని తయారుచేసే పద్ధతి:





మూడు వంతుల నల్లమట్టి, ఒక వంతు పశువుల ఎరువుల మిశ్రమాన్ని గడ్డలులేకుండా నలగగొట్టి, దానిలో ముద్దగాచేయడానికి తగినన్ని నీళ్ళు కలిపి, పెద్ద నిమ్మకాయ సైజులో ముద్దలుగా చేస్తారు.ఈ ముద్దలు చేసేటపుడే ఒకటి రెండువిత్తనాలు ( దేశీయ వృక్షజాతులు, పండ్లజాతులు) మధ్యలో వుంచుతారు. నీళ్లకు బదులుగా అవకాశంవుంటే జీవామృతం వాడగలిగితే ఇంకా మంచిది. అలాగే ఈ మట్టిమిశ్రమంలో కొద్దిగా జీవన ఎరువుల మిశ్రమాన్ని కూడా కలుపుకోవచ్చు. మట్టిలో జిగట తక్కువగావుంటే కొంచెం కాగితపుగుజ్జను కలుపుకోవచ్చు. ఇవన్నీ అవకాశాన్నిబట్టీ, ఆసక్తిని బట్టీ మెరుగుపరుచుకోదగిన పద్ధతులే. ఇలా చేసిన విత్తన బంతుల్ని 2-3 రోజులు పూర్తిగా ఆరబెట్టి తయారుగా వుంచుకోవాలి.

## భాగస్వామ్యం:



విత్తన బంతుల తయారీలోనూ, వెదజల్లే కార్యక్రమంలోనూ అందరినీ భాగస్వామ్యులను చెయ్యాలి. ఎండాకాలంలో స్కూళ్ళకూ, కాలేజీలకూ సెలవులుంటాయి, పొలంపనులు కూడా తక్కువ కనుక అందరికీ తీరిక వుంటుంది. ఇలాంటప్పుడు అందరూ కలిసి విత్తన బంతుల్ని తయారుచేస్తే అది ఒక ఆటవిడుపులా, వేడుకలా వుంటుంది.

అలాగే తొలకరికి ముందు లేదా వర్షాకాలంలో ఎప్పుడైనా ఈ విత్తన బంతుల్ని వెదజల్లే కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం ఒకరోజు అందరి భాగస్వామ్యంతో వేడుకలా చేసుకోండి. ఇది ఒక మంచి సంస్కృతికి శ్రీకారం చుట్టడమే కాకుండా మొక్కల పెంపకం సామాజిక కర్తవ్యమనే భావన ప్రతి ఒక్కరిలో నాటుకోవడానికి దోహదం చేస్తుంది.

ఈ విత్తన బంతుల్ని రోడ్లప్రక్కన ఖాళీస్థలాల్లో, వూరిబయట కొండలు, గుట్టల్లో విసిరితే వర్షంవచ్చినపుడు నీటితో తడిసి అవి మొలకెత్తుతాయి. ఈ విత్తన బంతుల్లో వున్న ఎరువు, విత్తనం మొలకెత్తి మొక్కగా కుదురుకునే దశలో అవసరమైన పోషకాలను అందిస్తుంది.



ఈ విత్తన బంతుల్ని పర్యావరణం బాగుండాలని కోరుకుంటూ విసరమనండి, తమకు ప్రియమైనవాళ్లను తలచుకుంటూ విసరమనండి, భౌతికంగా తమకు దూరమైన ఆప్తుల స్మృతిచిహ్నంగా విసరమనండి.

మన ప్రాంతంలో అంతరించిపోతున్న వృక్షజాతులకు తిరిగిప్రాణంపోయడానికీ, కొత్త కొత్త మొక్కల్ని మన ప్రాంతానికి పరిచయంచేయడానికీ, చెట్ల విలువను, ప్రకృతిలో వాటి స్థానాన్ని గురించి భవిష్యతరాల్లో అవగాహన, ప్రేమ

పెంచడానికి, ఒక సామాజిక బాధ్యతకోసం నలుగురూ కలిసి పనిచేయడానికి విత్తన బంతులు విసరడాన్ని ఒక సదవకాశంగా మలచుకోండి.




విత్తన బంతుల్ని చిన్న చిన్న కాగితం కవర్లలో అందంగా ప్యాక్ చేసి వేడుకల్లో అతిథులకు బహుమతులుగా ఇద్దాం. ఇలాంటివి ఇంకా ఎన్నెన్నో సలహాలు, సూచనలు మన బృందాలనుంచి సేకరించి దీనినొక మహాయజ్ఞంగా ఆచరిద్దాం. పచ్చని ప్రకృతిని భవిష్యతరాలకు సగర్వంగా అందచేద్దాం.

\- **బోడెంపూడి శ్రీదేవి**